కోరిన కోర్కెలు తీర్చే... ధ్యానాంజనేయస్వామి

- నాటి కరో మన్ ఘట్ నేటి కర్మన్‌ఘాట్
- రెండో ప్రతాపరుద్రుడిచే ఆలయ నిర్మాణం
- నేడు హనుమజ్జయంతి సందర్భంగా ఏర్పాట్లు

చంపాపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొలిచిన వారి కోర్కెలు తీర్చే శ్రీ ధ్యానాంజనేయుడు.. ఆయనను నిత్యం స్మరిస్తే భూత, ప్రేత పిశాళ, అనారోగ్య భయాలను పోగొడుతాడనే భక్తులకు ప్రగాఢ విశ్వాసం... అలాంటి అంజనేయుడు ధ్యానముద్రలో స్వయంభువుగా వెలిసిన పురాతన చారిత్మక కలిగిన ఆలయం చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయం. భక్తులకు కోరిన వరాలిచ్చే దైవంగా నిత్య పూజలందుకుంటున్న ప్రాచీన ఆలయం. కాకతీయ ప్రభువులచేత నిర్మించబడిన ఈ ఆలయం నేటికి భక్తులతో విరాజిల్లుతుంది. క్రీ.శ 1143లో నాటి గోల్కొండ దుర్గాన్ని పాలించిన రెండో ప్రతాప రుద్రుడు మొదలు కొని ఔరంగజేబు వరకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామిని కొలిచేవారని చరిత్ర చెబుతుంది. ఆనాడు నిర్మించిన కోనేరు నేటి వరకు చెక్కు చెదరకుండా వుంది.

రెండో ప్రతాపరుద్రుడు క్రీ.శ 1143లో హనుమజ్జయంతి రోజున ఆలయ నిర్మాణ పనులను మొదలు పెట్టారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసి అర్చకులను నియమించి, ఆలయంకు కొంత భూములను కేటాయించాడు. నాడు ఆయన నిర్మించిన ఆలయ ప్రాంగణం లోనే కాకతీయ రాజులందరు తమకు ఇష్టదైవాలైన శ్రీ గణపతి, జగన్నాథస్వామి, సంతోషిమాత, కోదండ రామాలయం, నాగేశ్వర, స్ఫటిక లింగేశ్వర, నవగ్రహాలు, సరస్వతీదేవి, దుర్గామాత, విశ్వనాథ ఆలయం, వేణుగోపాలస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, కృష్ణ మందిరం, కేదారి హనుమాన్ మందిరం ఆలయాలను నిర్మించారు.

17వ శతాబ్దంలో గోల్కొండను గెలిచిన తర్వాత ఔరంగజేబు చక్రవర్తి కర్మన్‌ఘాట్ దేవాలయాన్ని ధ్వంసం చేయడానికి సైన్యంతో వచ్చాడు. ఆలయ సింహద్వారం వద్దకు ఔరంగజేబు రాగానే లోపలి నుంచి హే రాజన్ మేరా మందిర్ తోడ్నా హైతో పహలే తుమ్ కరో మన్ ఘట్ అంటూ భీకర శబ్దం వినిపించింది. దీంతో భయపడిన ఔరంగజేబు అక్కడి నుంచి వెనుదిరిగాడు. అనాటి నుంచి ఈ ప్రాంతాన్ని కర్మన్‌ఘాట్‌గా పేరు వచ్చింది. ప్రతి రోజుతో పాటు మంగళవారం, శనివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని మనసులో ఉన్న కోర్కెలను కోరి తీర్చుకుంటున్నారు. పుష్కరిణి మధ్యలో ధ్యానాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. పరుల ఆధీనంలో ఉన్న స్వామి వారి పొలం నేడు కొంత స్వాధీనం చేసుకున్నారు.



నిత్య పూజలందుకుంటున్న ధ్యానాంజనేయ స్వామి, పుష్కరిణిలో హనుమాన్ ప్రతిమ

నేడు హనుమాన్ జయంతి...

హనుమజ్జయంతిని పురస్కరించుకొని కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. 23న ఉదయం 4.45 గంటలకు స్వామి వారికి సుప్రభాతం, 5 గంటలకు అభిషేకాలు, అర్చనలు సాయంత్రం 6 గంటలకు శ్రీ సీతా రామలక్ష్మణ సమేత హనుమాత్ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈవో ఎం. శ్రీనివాసశర్మ తెలిపారు.



నాదర్‌గుల్ పాత గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న స్థలాన్ని ఆక్రమించి మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు చేపట్టిన నిర్మాణం

పాత గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణకు యత్నం

- అడ్డుకోవాలని బడంగ్‌పేట్ కమిషనర్‌కు స్థానికుల వినతి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల పాత గ్రామ పంచాయతీ కార్యాలయం స్థలాన్ని ఆక్రమించడానికి మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. కార్యాలయం ముందున్న ఖాళీ స్థలాన్ని సగానికిపైగా ఆక్రమించి భవనం నిర్మించుకోవడానికిగాను పునాది తవ్వి పిల్లర్లు వేస్తున్నారు. విషయం తెలుసుకున్న నాదర్‌గుల్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందాడి శ్రీరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఈ విషయంపై సోమవారం బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సదరు స్థలం గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉందని, ఇన్నేళ్ల తర్వాత ఓ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు వచ్చి, ఆ స్థలం తమదేనని ఖాళీ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అది గ్రామ కంఠం స్థలం కాగా దానిని తమ సొంత స్థలం అని చెప్పుకుంటూ ఆక్రమణదారులు స్థానికులను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని దీనిని అడ్డుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు. తమ సిబ్బందిని అక్కడకు పంపించి సమగ్ర వివరాలు తెలుసుకుని, తదుపరి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బంగారి శంకర్, జెనిగె వెంకటేశ్‌యాదవ్, మర్రి తిరుపతిరెడ్డి, సామ సుధాకర్‌రెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి, యాతం మహేందర్‌యాదవ్, ఉట్టి శివకుమార్, క్యారగారి శ్రీధర్, మరాఠి నర్సింగ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఓటు వేయండి చైతన్యం చాటండి

- అవగాహన ర్యాలీలో మెప్మా ఏవో జ్ఞానేశ్వర్

సరూర్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా మెప్మా ఏవో జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో నిర్వహించిన ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగి ఉన్న వారు ఓటు వేయడానికి ముందుకు రాకపోవడం బాధాకరమని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని చైతన్యం చాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మునిసిపల్ మేనేజర్ నాగేశ్‌బాబు, మెప్మా ఏడీఎంసీ ఉమేశ్, టీఎంసీ ఆర్.శంకర్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, స్వయం సహాక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అవినీతి నిర్మూలన కమిటీ ప్రతినిధి ఎంబీ పతి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికే అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించారని తెలిపారు. అవినీతికి తావులేకుండా ప్రతి పౌరుడు అవినీతి రహిత సమాజానికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను గుర్తించి, సమాజహితం కోరేవారినే తమ ఓటు హక్కుతో ఎన్నుకోవాలన్నారు.

ఇంద్రారెడ్డికి బీఆర్‌ఎస్ నేతల నివాళి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి 24వ వర్థంతి సందర్భంగా సోమవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన బీఆర్ఎస్ నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డితో కలిసి చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామానికి వెళ్లి, ఇంద్రారెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బోయపల్లి శేఖర్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, పంతంగి మాధవీవెంకటేశ్వరరావు, మాదరి రమేశ్, జిల్లా విజయ్‌కుమార్, దాస్, రిషికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు

సైదాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ జైలు గార్డెన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 52వ జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు సోమవారం అభిషేకాలు, చండీహోమం, మహిళల సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. జయశ్రీ బృందం భజనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మధుకర్, ఉపాధ్యక్షుడు మదన్‌బాబు, కృపానంద్, శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, వెంకటరమణ తదితరులు తెలిపారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

- తన చావుకు తానే కారణమని సూసైడ్ నోట్
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన



గుగులోతు విజయ్(ఫైల్)

గరిడేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లంబా తండాకు చెందిన గుగులోతు బాలు కుమారుడు విజయ్ (22) హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ డయాలసిస్ కోర్సు చేస్తున్నాడు. ఐదుగురు మిత్రులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో రూం తీసుకొని ఉంటున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు రూంలో చూస్తే బ్యాగు లేకపోవడంతో స్నేహితులు విజయ్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించారు. విజయ్ ఉదయం వరకు రాకపోయేసరికి ఆదివారం ఉదయం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి సుమారు 12గంటల ప్రాంతంలో విజయ్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తన మృతికి ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాశాడు. తన రూంలోని స్నేహితులు, కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టొద్దని రాశాడు. 'నేను జీవితంలో ఏమీ సాధించలేనని, నా చావుకు నేనే కారణం' అని నోట్‌లో పేర్కొన్నాడు. తన తండ్రి, బంధువు, తన రూమ్‌మేట్స్‌కు సంబంధించిన మూడు ఫోన్ నంబర్లు రాసినట్లు స్నేహితులు తెలిపారు. సోమవారం ఉదయం ఉత్తరంలోని ఫోన్ నంబర్ల ఆధారంగా మిర్యాలగూడ రైల్వే అధికారులు పోలీసులకు, విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా తర్వాత మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

నిరుద్యోగులకు అన్యాయం చేసిన కేంద్రం

- కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు పూర్తిగా అన్యాయం చేసిందని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సరూర్‌నగర్ డివిజన్‌లో జరిగిన రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. రోడ్ షోకు సరూర్‌నగర్ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. హుడా కాంప్లెక్స్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆశలు కల్పించి వారి భవిష్యత్‌ను నాశనం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్న ఉత్సాహంతో ఉన్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, ఏనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, శివప్రసాద్, జంగారెడ్డి, రాఘవేందర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ రంజిత్‌రెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్ నాయక్, పామ్ యాదగిరి, మహమ్మద్ షఫీ, మహమ్మద్ పటేల్, ఎండీ పాషా, ఇస్మాయిల్, సురేష్ తదితరులు తమ అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు.



సరూర్‌నగర్ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, పిట్ల హరినాథ్‌రెడ్డి, నిజాముద్దీన్, శారద, అమరేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, రమేష్‌నేత, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న పారిజాతారెడ్డి

రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, కేంద్రంలో ఒకే పార్టీకి చెందిన ప్రభుత్వాలు అధికారంలో ఉంటేనే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల పరిధిలోని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ఆదివారం రాత్రి నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని పలు కాలనీల్లో స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల్లోనే అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను వారికి వివరించారు. భవిష్యత్‌లోనూ ఇదే తరహా అభివృద్ధి కొనసాగాలంటే రంజిత్‌రెడ్డిని ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధీరజ్ రెడ్డిని సన్మానిస్తున్న శుభోదయ కాలనీవాసులు

సివిల్ సర్వీస్ ర్యాంకర్ ధీరజ్ రెడ్డికి సన్మానం

వనస్థలిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ పరిక్షల్లో 173వ ర్యాంక్‌ను సాధించిన మన్సూరాబాద్ డివిజన్ శుభోదయ కాలనీకి చెందిన ధీరజ్ రెడ్డిని కాలనీవాసులు సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. తమ కాలనీకి చెందిన ధీరజ్ రెడ్డి సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం హర్షనీయమన్నారు. తన సర్వీస్‌లో ప్రజలకు నిస్వార్థంగా సేవలందించేందుకు తన వంతుగా కృషి చెస్తానని ధీరజ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్దం వెంకట్ రెడ్డి, కనకదుర్గ దేవాలయం చైర్మన్ మేకల సత్యనారాయణ, కాలనీ గౌరవ అధ్యక్షులు మిద్దెల మల్లేషం గౌడ్, కోశాధికారి రాజేశ్వర్ రావు, లింగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటరమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిప్పర్ ఢీ కొట్టడంతో పక్కకు ఒరిగిన సీసీ కెమెరాల స్తంభం

టిప్పర్ ఢీకొని ఒరిగిన సీసీ కెమెరాల స్తంభం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని నాయగ్రా హోటల్ సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్తంభాన్ని సోమవారం జీహెచ్‌ఎంసీకి చెందిన టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో నిఘా కెమెరాలు బిగించిన స్తంభం ఒక పక్కకు ఒరిగింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు హుటాహుటిన సంసంఘటన స్థలాన్ని చేరుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పాండురంగం

గురుకులంలో అర్హత సాధించిన విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 6 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించినట్లు స్కూల్ హెచ్‌ఎం పాండురంగం తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 8 మంది విద్యార్థులు 5వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయినట్లు తెలిపారు. అందులో 6 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఎంఈవో వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం పాండురంగం అభినందించారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ బాలాజీ నగర్ రోడ్ నెం.6 లో ఉన్న మోనార్క్ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన అపార్టుమెంట్ వాసులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. జలమండలి సరఫరా చేసే తాగునీటిని సంపు నుంచి ట్యాంక్‌కు పంపే వ్యవస్థ లేదని తదితర సమస్యలు అపార్టుమెంట్ అధ్యక్షుడు గణేష్ తెలిపారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు.



కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్ రెడ్డి నామినేషన్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సునీతారెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పట్నం సునీతమహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, వజీర్ ప్రకాశ్ గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్, మిద్దెల జితేందర్, సామ రమణా రెడ్డి, లక్ష్మీప్రసన్న, కత్తుల రాంబాబు పాల్గొన్నారు.



చంచల్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఎంఐఎం ఇంటింటి ప్రచారం...

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం సాయంత్రం హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చావుని డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్ మూన్, ఆజంపుర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్, నాయకులు సయ్యద్ అలీం, అనాస్ ఖాద్రీ తోపాటు మందితో కలిసి ఆయన ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎంఐఎంకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం, అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం పనిచేసే ఎంఐఎంకు మద్దతుగా నిలవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



చంపాపేట పీఎస్‌లో పదవీ విరమణ పొందుతున్న టీచర్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, తదితరులు

ఎస్‌జీటీ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ

చంపాపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎస్‌జీటీ ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, నర్సింహ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరూర్‌నగర్ మండల విద్యాధికారి కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వృత్తిలో భాగంగా అంకిత భావంతో పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అనధికార లే అవుట్‌లో రోడ్డును ధ్వంసం చేయిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

అనధికార లే అవుట్‌పై మున్సిపల్ అధికారుల చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లో ఇటీవల వెలసిన అనధికార లే అవుట్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వే నంబర్ 102లో అనాధికార లే అవుట్ చేసినట్లు గుర్తించిన అధికారులు సోమవారం ఎక్సకవేటర్ సహాయంతో రోడ్డు, హద్దు రాళ్లలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు తీసుకున్న తర్వాతనే లే అవుట్‌లు, నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లేకుంటే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వేప మొక్కను నాటి నీరు పోస్తున్న ప్రకృతి వైద్యులు రామచంద్ర

పంచభూతాలను రక్షించుకుందాం

- ప్రకృతి వైద్యులు కేవై రామచంద్ర

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంచ భూతాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ ప్రకృతి వైద్యులు కేవై రామచంద్ర పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని సోమవారం కుంట్లూర్ పరిధిలోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్ర, ఎన్‌జీ పద్మ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ధరిత్రిని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని భూమిలో కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో వేప మొక్కను నాటారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సహజవనరుల పరిరక్షణకు గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఏవో ప్రేమ్‌కుమార్, ఎర్త్ ఫౌండేషన్ సీఈవో సురేందర్, చైతన్యరెడ్డి, శివారెడ్డి, సుభాష్‌చంద్ర. రఘురాం, సాయినీరజ్, సతీష్‌రెడ్డి, సురేష్, హర్షవర్ధన్, బిక్షపతి, ఆనంద్ పాల్గొన్నారు.



ధరిత్రి దినోత్సవంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన, తదితరులు

శారదానగర్‌లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

వనస్థలిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూమిని మనం కాపాడితే భూమాత మనల్ని కాపాడుతుందని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భూసారాన్ని తగ్గించే కృతిమ ఎరువులు, హానికర వంట అంట్లు తోమే రసాయన సబ్బులు, వాషింగ్ సర్ఫుల వాడకాన్ని తగ్గిస్తూ భూమాతను కాపాడుకుందాం అంటు కాలనీవాసులతో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా చెత్తకుప్పను తలపించే ఇంకుడు గుంతను తిరిగి పునరుద్ధరించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త కొండవీటి రాజేందర్ రెడ్డి, కాలనీ కార్యదర్శి కెవిఎల్ఎన్ రావు, సీహెచ్.వి.ఆర్.కే మూర్తి, ఇందిర, అరుణ, బాలకృష్ణ, హనుమంతరావు, భావరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.